

కథా నిలయం
శ్రీకాకుళం

# కథ వెనుక కథ

— సుస్మితా రమణమూర్తి

తన కలం పట్టుమని పది వాక్యాలు రాయడానిక్కూడా వెనుకంజ వేస్తోంది.

కారణం-ఈ మధ్య వివిధ వార, మాస పత్రికలు నిర్వహించిన కథల పోటీలకు కథలు రాసీ రాసీ మానసికంగా అలసిపోయాడు తను.

'అంత పట్టుదల దేనికి? హాయిగా ఓ నాల్రోజులు ఫ్రీగా వుండొచ్చు కదా? అలా బుర్ర పాడు చేసుకోవడం దేనికి?' అలా అనుకోవడానికి కూడా వీల్లేదాయె. అలాంటి పరిస్థితిలో వున్నాడు తను.

శ్రీకాంత్ రచనలు ఇంచుమించు ప్రస్తుతం అన్ని పత్రికలలోను విరివిగా వస్తున్నాయ్. తన రచనల మీద పత్రికల వాళ్ళకు ప్రత్యేకమైన అభిమానం వుంది. అందువల్లే తను రచయితగా బతికేస్తున్నాడు. కష్టపడి పది కథలు రాస్తే-ఆ పదిలో ఓ ఆరేడు కథలు స్వల్పకాలంలోనే వెలుగు చూస్తున్నాయ్.

'శ్రీకాంత్ ఎలాంటి (చెత్త) కథ రాసినా పడి తీరుతుంది. బాగా పాపులర్ అయిపోయాడు' అని అనుకుంటున్న తోటి రచయిత మిత్రులకు తన తిరుగుటపా కథల విషయం తెలియదు.

ఓ నెల్రోజుల్లో సాహితీ నందనవనంలోకి నూతనంగా అడుగిడనున్న ఓ మాసపత్రిక సంపాదకుడు 'మా ప్రారంభ సంచికకు తమ కథొకటి పదిరోజుల్లో పంపి సహకరించండి' అంటూ రాసిన పుత్తరంకి సమాధానంగా ఆ పత్రికకు శ్రీకాంత్ కథ వెళ్ళనేలేదు.

క్రొత్త కథ రాస్తే కదా-ఆ పత్రికకు పంపడానికి? ఆ పుత్తరం వచ్చిన్నాటి నుంచీ శ్రీకాంత్ ఎప్పటి కప్పుడు అనుకుంటూనే వున్నాడు- ఈ రోజెలాగైనా కథ రాసి పంపించేయాలని.

అలా అనుకోడమే అవుతోంది గాని, కథ రాయడం మాత్రం అవటం లేదు. అలా అనుకుంటూనే తను ఆర్రోజులు గడిపేశాడు. 'ఇంకా క్రొత్త కథ రాద్దాం! రాద్దాం!' అనుకుంటూనే వున్నాడు.

అదుగో-అలా అనుకుంటున్నప్పుడే శ్రీకాంత్‌కి క్రిందటి రోజు తిరిగొచ్చిన తన కథ గుర్తొచ్చింది.

'హమ్మయ్య! క్రొత్త కథ రాసే బెడద తప్పింది. ఆ కథ పంపిస్తే పోలా? ఆ పత్రిక వాళ్ళు కథ కావాలని స్వయంగా కోరినప్పుడు క్రొత్త కథే పంపాల్సిన అవసరమేముంది? ఇదివరకు పడనిదేదైనా పంపించొచ్చుకదా? అలాంటప్పుడు నిన్న తిరిగొచ్చిందే పంపించేస్తేసరి!

'ఆ వెధవ కథ రాసిన ముహూర్తం(వేం)విటో ఇంచుమించు అయిదారు పెద్ద పత్రికలు ఐక మత్యంగా తిరగ్గొట్టేశారు దాన్ని. ఎప్పుడో కలం పట్టిన మొదట్లో రాసిన కథది. సుమారు నాలుగేళ్ళ నుంచీ ఆ కథలా అన్ని పత్రికల చుట్టూ ప్రదక్షిణం చేస్తూనే వుంది. ఇప్పటికైనా దానికి మోక్షం వస్తుంది. ఆ ప్రారంభ సంచికకు తోసేస్తే సరి! ఇక దాని గొడవ వదిలిపోతుంది.

కాగితాలు బాగా నలిగిపోయాయే! ఎలా? మరోసారి ఫెయిర్ చేస్తే సరిపోతుంది. లేకుంటే ఏదో పత్రిక నుంచి తిరిగొచ్చిన కథని కాగితాలు చూసిన వెంటనే ఇట్టే తెలిసిపోతుంది.

అబ్బా! పది పేజీలు మళ్ళీ రాయాలా? ఓ రెండు గంటలు టైమ్ వేస్ట్. ఎవడు రాస్తాడు మళ్ళీ దాన్ని? చాకలివాడికి వేస్తే పోలా!

వాడి ఇస్త్రీ పెట్టె క్రిందకు ఓ సారి కథ వెళ్ళొస్తే పాత కాగితాలు సాపుగా తయారైపోవూ? అలా తనెన్ని సార్లు చేయలేదు? ఈసారి కూడా అలా చేస్తే సరి. ఫెయిర్ చేసే బెడదుండదు.'

అనుకున్నదే తడవుగా శ్రీకాంత్ కథను అర్జంటుగా చాకలాడికి వేసేయడం-కథ చక్కగా 'ఇస్త్రీ' అయిపోవడం కొన్ని నిముషాల్లో జరిగిపోయింది. అర్జంటుగా ఆ కథ ఆ క్రొత్త పత్రికకు పంపించేసి తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు శ్రీకాంత్.

పది రోజుల తర్వాత (ఆ ప్రారంభ సంచిక రాకముందే) ఆ పత్రిక సంపాదకుని నుంచి శ్రీకాంత్‌కి తన కథతోబాటు ఓ వుత్తరం వచ్చింది.

కథ మళ్ళీ తిరిగొచ్చినందుకు అదోలా ఫీలయ్యాడు శ్రీకాంత్.

కథ అడిగినతర్వాత కూడా అది తిరిగి రావడం జరిగినందుకు శ్రీకాంత్ లోని రచయిత చాలా బాధ పడిపోయాడు. ఈ క్రొత్త పత్రిక వాళ్ళకే ఆ కథ నచ్చనందుకు ఆశ్చర్యపోయాడు.

'ఎన్నో ఏళ్ళ నుంచి అప్పుడప్పుడు వుండులా సలుపుతున్న తన కథ ఈసారి గేరంటీగా పడిపోతుంది-చెల్లిపోతుంది. అడిగిన తర్వాత ఎవడికోసంవేసుకుంటారు?' అన్న ధీమాలో వున్న శ్రీకాంత్ తన కథ గోడకు కొట్టిన బంతిలా తిరిగొచ్చినందుకు చీకాకు పడ్డాడు.

క్రొత్త కథ రాసి పంపించి వుంటే బావుండే దనుకున్నాడు. 'ఏం? ఈ కథేమైనా తీసిపోయిందా?

అడిగి కూడా తిరిగొస్తేశారే....!?
ప్చ్! పత్రికలు వాళ్ళ చేతుల్లో వున్నాయ్. అంతా వాళ్ళిష్టం! ఏం చేయగలం?'

కథను అసహనంగా బల్లమీద పడేసి-కథతోబాటు వచ్చిన ఉత్తరం వేపు తన చూపుల్ని పోనిచ్చాడు శ్రీకాంత్.

''వర్ధమాన రచయితలు శ్రీ శ్రీకాంత్ గార్కి, నమస్కారాలు. కోరిన వెంటనే తమరు (మీ) మా ప్రారంభ సంచికకు కథ పంపి సహకరించినందుకు సంతోషం. కృతజ్ఞతలు.

నేను మూడేళ్ళక్రితం 'సాహితి' పత్రికలో ఉపసంపాదకుడిగా పన్జేసేవాణ్ణి. అప్పుడు సాహితి పత్రికలో ప్రచురణార్థం పరిశీలనకు తమరు పంపిన 'తిరిగొచ్చిన కథ' అన్న కథ నేను మొదటి సారిగా చదవడం జరిగింది. కథ మంచిదే అయినా కొన్ని లోపాలవల్ల ఆ కథ త్రిప్పి పంపడం జరిగింది. ఆ తర్వాత నేను 'భావన' పత్రికలోకి మారడం-అక్కడ తమ కథ రెండోసారి కూడా చదవడం జరిగింది.

ప్రస్తుతం నా సంపాదకత్వంలో త్వరలో వెలువడనున్న 'జాబిల్లి' మాసపత్రికకు తమరు పంపిన (అదే) కథ మూడోసారి కూడా చదవడం జరిగింది. ఇన్నిసార్లు చదివినా-కథలో ఇంత వరకూ ఒక్క అక్షరం కూడా మార్చినట్లు నాక్కన్పించలేదు.

ఈమధ్య తమ కథలు చాలా పత్రికలలో చూస్తున్నాను. రచయితగా తమరు ఎదుగుతున్నారు. తమకు చెప్పేపాటి వాణ్ణి కాకపోయినప్పటికీ తమకు నా దొక మనవి. ఇన్ని సార్లు తమ కథ ఎందుకు తిరిగి వచ్చింది?- అన్న కోణంలోంచి ఒక్కసారి ఆలోచించండి. ఆ ఉద్దేశంతో, ఆ ఆలోచనతో తమ కథ మరొక్కసారి చదివి చూడండి. ఆ కథలోని లోపాలు ఏమిటో తమకే అర్థం అవుతాయ్. ఇప్పుడు పత్రికా సంపాదకుడి నైనా- ఒకప్పుడు నేనూ 'కథ అడిగారు కదా! తప్పకుండా వేసుకుని తీరుతారు'- అన్న అభిప్రాయంతోనే గతంలో పత్రికలకు కథలు పంపినవాణ్ణే! ఇలా రాస్తున్నందుకు అన్యథాభావించక-సహృదయంతో అర్థం చేసుకోగలరని నా మనవి. తమ కలం నుంచి మంచి మంచి రచనలు వెలువడాలని ఆశిస్తున్నాను.ఆఖరుగా ఒక విజ్ఞప్తి-

ఇలా రాసే అధికారం ఎవరిచ్చా

రీతనికి: అని గాని మీ రనుకుంటే దానికి నా సమాధానం ఇది- నేను ఒకప్పటి నీ (సుదర్శనం)మిత్రుణ్ణి. ఇప్పుడు 'స్పుత్నిక్' అన్న కలం పేరుతో సాహితీ లోకంలో వుంటున్న వాణ్ణి.... సెలవు.

భవదీయ-స్పుత్నిక్."

కథ తిరిగి వచ్చిన దానికంటే ఆ వుత్తరం శ్రీకాంత్‌ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఆ వుత్తరం సూటిగా, ఘాటుగా వున్నప్పటికీ కొన్ని నిముషాలు శ్రీకాంత్‌ని తన కథ గురించి ఆలోచింప జేసింది. *

## రచయితలకు మనవి

'విజయ'లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు-ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరు వారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు - అభిమానుల పేజీ'లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్,

'విజయ'

80-ధనలక్ష్మి కాలనీ,

మద్రాసు-600 026.